క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జహీరాబాద్ టౌన్: ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు ఆదివారం ఎమ్మెల్యే మాణిక్‌రావును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్, ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసి అల్లాహుఖాన్‌ను ఎమ్మెల్యే మాణిక్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.2.5లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదివారం బాధిత మహిళా కుటుంబ సభ్యులకు అందజేశారు.

కొనసాగుతున్న తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది

కంది(సంగారెడ్డి): మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ కొనసాగుతోంది. ఈ నెల 25న ప్రారంభమైన తనిఖీ వచ్చే నెల 3వరకు పూర్తి కానుంది. ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున సభ్యులు ఉంటారు. 8 బృందాలు మండలంలోని 22 గ్రామాల్లో 2022 ఆగస్టు 1నుంచి 2023 మార్చి 31వరకు ఈజీయస్ ద్వారా చేపట్టిన పనులపై తనిఖీ నిర్వహిస్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెరువులు, కుంటలు, కాల్వల పూడికతీత, ఇంకుడు గుంతల నిర్మాణం, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, మొక్కలు నాటడం, వననర్సరీల నిర్వహణ వంటి పనుల్లో జరిగిన అవకతవకలను వచ్చే నెల 4న ఎంపీపీ కార్యాలయంలో జిల్లా అధికారుల సమక్షంలో నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో తనిఖీ బృందం సభ్యులు వివరిస్తారని సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.


సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజయ్య

సంగారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య అన్నాడు. సీఐటీయూ జిల్లా నాయకత్వ శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, సాయిలు, నాయకులు పాండురంగారెడ్డి, యాదగిరి, ప్రవీణ్, మహిపాల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ఆదివారం పారిశుద్ధ్య కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంతోష తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదికి.. ముగ్గురే..

- వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత
- పనుల్లో తీవ్ర జాప్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజల అసహనం



వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయంలో తొమ్మిది మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరు పోస్టులు ఖాళీలు ఉన్నాయి. దాదాపు రెండు నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో డిప్యూటీ తహసీల్దార్ శంభిరెడ్డి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయానికి పెద్దదిక్కుగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌ను సంగారెడ్డికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సిబ్బంది కొరత.. ఆపై ఎన్నికల బిజీ

తహసీల్దార్ కార్యాలయంలో కీలకమైన తహసీల్దార్, రెండు ఆర్ఐ, రెండు అటెండర్ పోస్టులు ఖాళీలు ఉండగా ఇవి చాలవన్నట్టు సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ డిప్యూటేషన్‌పై వెళ్లి హత్నూర తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. దీంతో కార్యాలయంలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు.

పూర్తిస్థాయి తహసీల్దార్ కరువు

వట్‌పల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన రాధాబాయి పదోన్నతిపై వెళ్లి దాదాపు రెండు నెలలు కావొస్తున్నా నేటికీ నూతన తహసీల్దార్‌ను నియమించలేదు. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ శాశ్వత తహసీల్దార్‌ను నియమించకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

> **పనుల్లో జాప్యం లేకుండా చూస్తాం**
>
> కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వీఆర్ఏల సహాయంతో రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం. ప్రస్తుత వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల వివరాల సేకరణ, ఓటరు నమోదు, బీఎల్ఓలకు శిక్షణ, ఖాదిరాబాద్‌లో ఇళ్ల స్థలాల పంపిణీపై కసరత్తు వంటి కార్యక్రమాల్లో బిజీగా ఉన్నాం.
>
> – శంభిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్

నల్లవాగు నీటితో సస్యశ్యామలం చేస్తాం



కల్హేర్: నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సింగూరు నీటితో నల్లవాగు ప్రాజెక్టును నింపి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మధ్యతరహ ప్రాజెక్టు నల్లవాగు నుంచి ఆయకట్టు భూములకు ఆదివారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ డీపీఆర్ సర్వే నివేదిక వచ్చిన వెంటనే పనులు చేసేందుకు పూర్తి బాధ్యతను తానే తీసుకుంటానని స్పష్టం చేశారు. నల్లవాగు చివరి ఆయకట్టు వరకు 6వేల పైగా ఎకరాలకు వానకాలం పంటలు పండించేందుకు నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. మోటార్లకు కరెంట్ మీటర్లు బిగించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వ్యవసాయనికి మూడు గంటలు కరెంట్ సరఫరా చేస్తామని ఇటీవల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ వైఖరిని బయటపెట్టారని గుర్తు చేశారు. ఈఈ జైభీం, డీఈఈ పవన్‌కుమార్, ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఘని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఖేడ్ ప్రాంత అభివృద్ధికి కృషి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ ప్రాంతంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖేడ్‌లోని మహంకాళి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్‌చైర్మన్ పరశురాం, అంబదాస్, శేఖర్, సుదర్శన్‌గౌడ్, అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు. పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అదేవిధంగా మహతీ జ్యోతిష్యాలయంలో వేదపండితులు మలమంచి గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్రచండీ యాగంలో పాల్గొన్నారు. వ్యాపారి సాయి సంగమేశ్వర్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. అబ్బెందలో చర్చి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయగా పనులు కొనసాగుతుండడంతో గ్రామ క్రైస్తవులు చర్చికి ఎమ్మెల్యేను ఆహ్వానించి సన్మానించారు.

నేడు, రేపు నీటి సరఫరా నిలిపివేత

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలో సోమ, మంగళవారం రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండబోదని, ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇంజనీర్ రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదాశివపేట పట్టణానికి నీటిసరఫరా విషయంలో మునిపల్లి మండలం బూసారెడ్డి పల్లిలోని మోటార్స్ రూమ్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని కాకతీయనగర్‌లో ఆదివారం బస్తీ దర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని తెలిపారు.

‘మానవాళికి రామాయణం దిక్సూచి’

నారాయణఖేడ్: మానవాళికి రామాయణం దిక్సూచీ అని కర్ణాటకలోని బీదర్‌కు చెందిన వైకుంఠ దత్తు మహారాజ్ తెలిపారు. పురుషోత్తమ మాసం పురస్కరించుకొని నారాయణఖేడ్‌లోని సత్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రామాయణ హరికథ కార్యక్రమంలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. రామాయణం దుష్ట సంహార ఇతివృత్తాన్ని తెలుపుతుందని వివరించారు.

శ్రమదానం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని సాయిబాబా దేవాలయ పరిసర ప్రాంతాల్లో ఆదివారం కౌన్సిలర్ సుజాత ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షణ

నారాయణఖేడ్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీబాత్‌లో భాగంగా దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న 103వ ఎపిసోడ్‌ను ఆదివారం నిర్వహించారు. ఢిల్లీ నుంచి ప్రధాని ప్రసంగించగా ఖేడ్‌లో బీజేపీ నాయకులు టీవీల్లో తిలకించారు. కార్యక్రమంలో ఖేడ్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కోటలే రజినీకాంత్, నాయకులు సుధాకర్, పట్నం మాణిక్, నగేష్ యాదవ్, వెంకట్‌రెడ్డి, సతీష్, అశోక్, సాయి, సుగుణాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని పొట్టిపల్లి, ఎల్గోయితో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఎల్గోయి గ్రామంలోని ఇంతేశేవాలి దర్గాలో జీకాట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఢిల్లీ వసంత్ నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



జహీరాబాద్ టౌన్: పీర్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే హాజరు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంత ప్రజలు మొహర్రం పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లచావిడి వద్ద ప్రతిష్ఠించిన పీర్లను వీధుల్లో ఊరేగించారు. జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు ఢిల్లీ వసంత్ తదితరులు హాజరై ప్రార్థనలు చేశారు.



ఝరాసంగం: మొహర్రం వేడుకలో ఢిల్లీ వసంత్, నాయకులు

జిన్నారం మండలంలో..

జిన్నారం(పటాన్‌చెరు): మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నల్తూర్‌గ్రామంలో జరిగిన ఉత్సవాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కాటా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. బొల్లారంలో నిర్వహించిన ఊరేగింపులో మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి హాజరయ్యారు. గుమ్మడిదల, బొంతపల్లి గ్రామాల్లో పీర్ల ఊరేగింపును చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

◆ నేటి ర్యాలీని జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్ / సంగారెడ్డి టౌన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరికీ మినిమం పే స్కేల్ ఇవ్వాలని, తదితర డిమాండ్లతో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధురనేని శేషాద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8:30 గంటలకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో సమగ్రశిక్షలో పనిచేసే ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ అరుణాచలగిరి ప్రదక్షిణకు స్పందన

సంగారెడ్డిటౌన్: పౌర్ణమి సందర్భంగా అరుణాచలగిరి ప్రదక్షిణకు సంగారెడ్డి డీపో నుంచి ప్రత్యేక టూర్ సూపర్ లగ్జరి బస్ ఏర్పాటు చేసినట్లు డీపో మేనేజరు ఉపేందర్ పేర్కొన్నారు. దీనికి ప్రయాణికుల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు.35 సీట్లకు టికెట్లు బుక్ కావటం జరిగిందని ఇలాగే ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు వేస్తామన్నారు. ప్రయాణికులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ అన్నదానం



వట్‌పల్లి(అందోల్): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబురావు జన్మదిన సందర్భంగా ఆదివారం జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుండిగల్‌లోని పల్లవి అనాథ ఆశ్రమంలో అనాథలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జాయింట్ డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ అనంతరెడ్డి, జోగిపేట క్లబ్ కోశాధికారి రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, సభ్యులు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తాం



జిన్నారం: వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రాజారాణి మాట్లాడుతూ వర్షాకాలం కావటంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నందునా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆస్పత్రి వైద్యురాలు రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కల్హేర్(నారాయణఖేడ్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సిర్గాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ అన్నారు. మండలం సుల్తానాబాద్, నిజాంపేట మండలం నాగధర్‌లో ఆదివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ వైద్యపరీక్షలు చేశారు. అనంతరం జ్వరం, ఇతర లక్షణాలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కళ్యాణ్, సిబ్బంది రాంచందర్, ఉపసర్పంచ్ అడివప్ప పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్‌నగర్, ఉస్మాన్‌నగర్, ఈదులనాగులపల్లిలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి 119మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు.



నారాయణఖేడ్‌లో..

అప్రమత్తంగా ఉండాలి

నారాయణఖేడ్: అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్లు దారం శంకర్, స్వప్న అభిషేక్ షెట్కార్, వివేకానంద్ అన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 3వ వార్డుల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం



తండావాసులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు



కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో డీఎస్పీ, పోలీసులు

డీఎస్పీ రఘు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజాభద్రతకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని జహీరాబాద్ డీఎస్పీ రఘు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని చీలపల్లి తండాలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 04 ఆటోలు, 45 బైక్‌ల పత్రాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో భద్రతా, భరోసా కల్పించేందుకు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. వాహనాలు కొనుగోలు, అమ్మకాలు చేసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, ఝరాసంగం, హద్నూర్, రాయికోడ్ ఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, రామనాయుడు, వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ మల్లేషం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కంగ్టి మండల కేంద్రంలో..

కంగ్టి(నారాయణఖేడ్): ప్రజల భద్రతే ముఖ్యమని, వారి క్షేమం కోసమే మేమున్నామని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. కంగ్టి మండల కేంద్రంలో ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రవాణా నిబంధనల ఉల్లంఘన, మద్యం సేవించి వాహనాల నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్డన్ సెర్చ్‌లో 53 ద్విచక్ర వాహనాలు, 4 ఫోర్‌వీల్ వెహికిల్స్ రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ హనుమంతు, ఎస్ఐలు సత్యనారాయణ, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రోడ్డు మూసివేత?



రోడ్డు దెబ్బతిన్న చోట ఏర్పాటు చేసిన బోర్డు

- 25 రోజులుగా నిలిచిన బస్ సర్వీసులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని బిజిలీపూర్, మర్వెల్లి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో బస్ సర్వీసులు నిలిచి 25 రోజులవుతున్నా అధికారుల పట్టించుకోకపోవడంతో రోడ్డు మార్గం నేటికీ తెరుచుకోవడం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతికి కల్వర్టు వద్ద ఒక వైపు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మూసివేయబడినది అని రోడ్డు దెబ్బతిన్న ప్రదేశంలో ఇరువైపులా బ్యానర్లు ఏర్పాటు చేసి ఎటువంటి మరమ్మతులు చేపట్టకుండానే చేతులు దులుపుకున్నారు.

ఇరువై రోజులుగా బస్సుల రాకపోకలు నిలిచిపోడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, దూర ప్రయాణాలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ మనోజ్‌ను వివరణ కోరగా మరమ్మతులకు సంబంధించి రూ.39 లక్షలు మంజూరవడంతో పాటు టెండర్లు కూడా పూర్తయ్యాయి. వర్షాలు తగ్గగానే రెండు రోజుల్లో పనులు మొదలు ప్రారంభిస్తామని తెలిపారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



మనూరు: దోసపల్లిలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని దోసపల్లి గ్రామంలో గ్రామదేవతల బోనాల ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్‌షెట్కార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేశ్‌షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుభాష్‌రావు, రాఘవచారి, బాణపూర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలో..

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆదివారం శ్రావణమాస బోనాలు ప్రారంభమయ్యాయి. స్థానిక కౌన్సిలర్ చంద్రారెడ్డి హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. అదేవిధంగా గుమ్మడిదల గ్రామంలో బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



జిన్నారంలో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400